క్లుప్తంగా

పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుభద్ర


సుభద్ర

సిరికొండ: ప్రగతిశీల మహిళ సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాళ్లరామడుగు గ్రామానికి చెందిన సుభద్ర ఎన్నికయ్యారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 7, 8 తేదీలలో పీవోడబ్ల్యూ రాష్ట్ర మూడో మహాసభలు జరిగాయి. ఈ మహాసభలో సుభద్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ తెలిపారు. ఇరవై ఏళ్లుగా మహిళ ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తూ డివిజన్ నుంచి రాష్ట్ర స్థాయి నేతగా సుభద్ర ఎదిగిందని కొనియాడారు. సుభద్రతో పాటు బోధన్‌కు చెందిన లక్ష్మీ, మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లికి చెందిన సవితలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సంతకాల సేకరణ



నిజామాబాద్‌నాగారం: బహుజన్ సమాజ్ పార్టీ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో శుక్రవారం నిజామాబాద్ రైల్వేస్టేషన్ వద్ద బీసీ సమాజానికి 52 శాతం రిజర్వేషన్లు పెంపు కోసం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు షకీల్ హైమద్, గంగాధర్ సూర్య వంశీ, గంగాధర్ గౌడ్, విశాల్ దామోదర్ పాల్గొన్నారు.

కెమిస్ట్రీ హెచ్‌వోడీగా నాగరాజు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ హెచ్‌వోడీగా అసోసియేట్ ప్రొఫెసర్ నాగరాజు, బీవోఎస్ చైర్మన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ బాలకిషన్‌లు నియమితులయ్యారు. తెయూ వీసీ రవీందర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం తన ఛాంబర్‌లో నాగరాజు, బాలకిషన్‌లకు వీసీ రవీందర్ నియామకపత్రం అందజేశారు. తమపై నమ్మకంతో పదవుల్లో నియమించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు ఇరువురు కృతజ్ఞతలు తెలిపారు.

బస్వా లక్ష్మీనర్సయ్యకు అభినందనలు



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పూమ్‌సే(65-70 సంవత్సరాల) విభాగంలో నిజామాబాద్ జిల్లా తైక్వాండో చైర్మన్ బస్వా లక్ష్మీ నర్సయ్య గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అభినందించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ జెడ్పీటీసీ మృతి


శక్కరికొండ ధర్మపురి (ఫైల్)

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మాజీ జెడ్పీటీసీ శక్కరికొండ ధర్మపురి(74) శుక్రవారం ఉదయం మృతి చెందారు.ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ ప్రభుత్వ హయాంలో డిచ్‌పల్లి జెడ్పీటీసీగా ఆయన పని చేశారు. ధర్మపురికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థిని



ధర్పల్లి: నిజామాబాద్ నగరంలోని అంబేడ్కర్ భవనంలో సోమవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ విజార్డ్ జిల్లా స్థాయి పోటీల్లో ధర్పల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని సంయుక్త ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర సాహెబ్ తెలిపారు. సంయుక్త జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. వరంగల్‌లో ఈనెల 13న ఎన్ఐటీలో జరిగే పోటీల్లో నిజామాబాద్ జిల్లా తరపున విద్యార్థిని పాల్గొనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంయుక్తను పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

తుదిదశకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- హైమదీబజార్‌లో వేగంగా సాగుతున్న పనులు
- రూ. 9.50 కోట్లతో నిర్మాణం
- అన్నిరకాల సౌకర్యాలు ఒకేచోట లభ్యమయ్యేలా ఏర్పాటు


హైమదీబజార్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం

నిజామాబాద్ నాగారం : కూరగాయలు.. మటన్.. చికెన్.. చేపలు...పండ్లు ఇలా అన్ని ఒకేచోట వినియోగదారులకు లభ్యమయ్యే విధంగా నగరంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. వినియోగదారులు అన్ని ఒకేచోట లభ్యమయ్యేలా నగరంలో నలువైపులా ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే హైమదిబజార్‌లో రూ. 9 .50 కోట్లతో జరుగుతున్న పనులు తుది దశకు చేరాయి. ఇందులో అమ్మకందారులకు, కొనుగోలుదారులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నారు. నగరంలో వసతులు లేని కూరగాయలు, ఫ్రూట్స్, మటన్, చికెన్ మార్కెట్లు చాలా ఉన్నాయి. నగరం నలువైపులా 10 కిలోమీటర్ల మేర విస్తరించింది. పండ్లు కొనుగోలు చేసేందుకు ఒక చోటికి.. కూరగాయలకు మరో చోటికి వెళ్లకుండా అన్నీ ఒకేచోట లభ్యమయ్యేలా ప్రస్తుతం ఈ మార్కెట్ల నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా ఒకటి హైదరాబాద్ రోడ్, రెండోది ఆర్మూర్ రోడ్‌వైపు, మూడోది వర్ని రోడ్ వైపు, నాలుగోది బోధన్‌రోడ్ వైపు, ఐదవది నగరం మధ్యలో నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. బోధన్‌రోడ్‌లోని హైమాదీబజార్‌లో 3,150 గజాల స్థలంలో రూ. 9.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయి. నగరం నడిబొడ్డున పాత తహసీల్, ఆర్‌డీవో కార్యాలయ స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మిగితా ప్రాంతాల్లో స్థల సేకరణ జరుగుతోంది.

అయితే హైమదిబజార్‌లో నిర్మిస్తున్న మార్కెట్ భవనంలో అండర్‌గ్రౌండ్‌లో వాహనాల పార్కింగ్ కోసం 38 ఫోర్‌వీల్ వాహనాలు, 31 బైక్‌లు పట్టే విధంగా నిర్మించారు. మొదటి అంతస్తులో 45 దుకాణాలు, రెండో అంతస్తులో 47 దుకాణాలు ఉండేలా నిర్మాణం చేశారు. 6 నెలలుగా పనులు జరుగుతున్నాయి. మార్చి చివరికల్లా పూర్తి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

వేగంగా పనులు పూర్తి చేస్తాం

హైమదిబజార్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అధునాతన వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చాం. వెజ్–నాన్‌వెజ్‌లతో పాటు పండ్లు, కూరగాయలు ఒకే దగ్గర లభించేలా దుకాణాల నిర్మాణాలు చేస్తున్నాం. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. మార్చి చివరికల్లా ప్రజలకు అందుబాటులో తెస్తాం. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు కూడా ఉండవు.

– రమేశ్, ఆర్అండ్‌బీ ఈఈ

బీఆర్ఎస్ పాలనలో యూనివర్సిటీలు నిర్వీర్యం

- తక్షణమే రూ.200 కోట్లు కేటాయించాలని ఏబీవీపీ డిమాండ్
- తెయూలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నేతలు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు మంజూరు చేసి యూనివర్సిటీలను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని, పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయాలని కుట్ర చేస్తుందని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శివ విమర్శించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని, యూనివర్సిటీ అభివృద్ధికి తక్షణమే రూ.200 కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌ను రద్దుచేసి పాత పద్దతిలో నియామకాలు చేపట్టాలని, తెయూలో నూతన బాలికల వసతి గృహం నిర్మించాలన్నారు. యూనివర్సిటీలో మౌళిక వసతులు కల్పించి, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు. టీచింగ్, నాన్–టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏబీవీపీ నేతలు నవీన్, సాయి, చక్రి, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

తెయూ వీసీకి సత్కారం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ ప్రైవేట్ డిగ్రీ కాలేజీల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వీసీ రవీందర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఇటీవలే అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. కొత్తగా ఎన్నికైన అసోసియేషన్ అధ్యక్షుడు అంబోజీ హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంజీవ్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు వీసీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు.

ఒత్తిడికి గురికావొద్దు

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయని సబ్జెక్టు నిపుణులు అన్నారు. శుక్రవారం న్యూఅంబేడ్కర్ భవన్‌లో బీసీ వసతి గృహ విద్యార్థులకు పదవ తరగతిలో మంచి ఫలితాల కోసం వివిధ సబెక్టు నిపుణులతో అవగహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన సదస్సులో టీచర్లు శారద, అరవింద్, కృష్ణ, లక్ష్మీనాథం, స్రవంతి, మురళీధర్‌లు పాల్గొని అవగహన కల్పించారు. బీసీ వసతి గృహం అధికారి నర్సయ్య పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు త్వరగా పూర్తిచేయండి


ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో చందర్

మోపాల్: మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో చందర్ సూచించారు. శుక్రవారం తాడేం, మోపాల్, కులాస్‌పూర్‌లో క్రీడా ప్రాంగణాలతో పాటు అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం వాటరింగ్‌డే సందర్భంగా మొక్కలకు నీరు పోయాలని సూచించారు. మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో మరో మొక్కను నాటాలన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రిని అందజేశామని, వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని సూచించారు. ఎంపీడీవో లింగం, ఏపీవో సునీత ఉన్నారు.

ఆరోగ్య సిబ్బందికి అవగాహన


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుదర్శనం

డిచ్‌పల్లి: జిల్లా పరిధిలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షణ అధికారులకు ఎంసీహెచ్, కేసీఆర్ కిట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులపై శుక్రవారం డిచ్‌పల్లి సీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో జిల్లా వైద్యాధికారి సుదర్శం పాల్గొని పలు సూచనలు చేశారు. ఆరోగ్య కార్యకర్తలందరూ నిరంతరం ఎప్పటికప్పుడు పెండింగ్ ఉంచకుండా డేటా నమోదు చేయాలన్నారు. పర్యవేక్షణ అధికారులు నిరంతరం డేటాను పర్యవేక్షించి మీ పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రాలలో డేటా పెండింగ్ ఉంచకుండా చూడాలన్నారు. గర్భిణీలకు పరీక్షలు, ప్రభుత్వ ప్రసవాలు పెంచాలని, ప్రసవం జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రాబోయే రోజులలో చివరి స్థానంలో ఎవరూ కూడా ఉండరాదని, పూర్ పర్ఫార్మెన్స్ ఉన్న వారి మందలించారు. ప్రతి రోజు చేసే సేవలు వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుమలత

సిరికొండ: మండలంలోని గడ్డమీదితండాలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సుమలత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మెడికల్ ఆఫీసర్ అరవింద్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 6,103 మందికి పరీక్షలు చేయగా అందులో 4,327 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. 939 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు డాక్టర్ తెలిపారు. 837 మందిని ఇతర చికిత్సల నిమిత్తం సిఫారసు చేసినట్లు వెల్లడించారు.

ధర్మారం(బి)లో శిబిరం పరిశీలన

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిచ్‌పల్లి ఎంపీవో నిట్టు కిషన్ రావు కోరారు. శుక్రవారం ధర్మారం(బి)లో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. కంటి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. కంటి సమస్యలు ఉన్న వారు కంటి పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. కంటి వైద్యనిపుణులు మానస పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ ఘట్టమనేని బాబూరావు

నిజామాబాద్‌నాగారం: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్‌లు నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఏరియా లీడర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావు పేర్కొన్నారు. క్లబ్ 8వ రీజియన్ మీట్ కార్యక్రమం శుక్రవారం నగర శివారులోని కమ్మ సంఘంలో అట్టహాసంగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 14 లయన్స్ క్లబ్‌లు చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా లయన్స్ రీజియన్ చైర్మన్ ఉండవల్లి శివాజీ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి బాబూరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సేవా కార్యక్రమాలతో ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ నగర ఏడీఈలు చంద్రశేఖర్, తోట రాజశేఖర్, వీరేశంలు శుక్రవారం తెలిపారు. అలాగే ముబారక్‌నగర్, బోర్గం పరిధిలోని వ్యవసాయదారులకు ఉదయం 6 గంటల నుంచి 8.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

16న చలో హైదరాబాద్

ఖలీల్‌వాడి: ఈనెల 16న ఆశా వర్కర్ల ఫిక్స్‌డ్ వేతనంతో పాటు ఇతర సమస్యలపైన ఉద్యమించడానికి పిలుపునిచ్చిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు నూర్జహాన్ అన్నారు. నగరంలోని నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆశా వర్కర్ల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు తెలంగాణ దారి దీపాలు పరిచయ సభ

మోపాల్ (నిజామాబాద్ రూరల్): తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షులు డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి సంపాదకత్వంలో వెలువడిన తెలంగాణ దారి దీపాలు మొదటి సంపుటి పరిచయ సభ శనివారం నర్సింగ్‌పల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతుందని తెరస జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్ప ప్రసాద్ శుక్రవారం తెలిపారు. 336 మంది తెలంగాణ ప్రముఖుల వివరాలతో పాటు జిల్లాకు చెందిన పది మంది ప్రముఖుల వివరాలు పొందుపర్చామని పేర్కొన్నారు.

మెరుగైన పథకాలు అమలు చేయాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్



డిచ్‌పల్లి: భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ పథకాలను పెంచి, పని భద్రత కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) పోరాడుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. మండలంలోని నిర్మాణ రంగ కార్మికులు, పెయింటర్స్ తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘంలో చేరారు. ఇతర నిర్మాణ కార్మికులకు మెరుగైన సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. పెళ్లికానుక, డెలివరీ పథకాన్ని రూ.30 వేల నుంచి రూ.లక్షకు పెంచాలన్నారు. సహజ మరణానికి రూ.5 లక్షల వరకు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల వరకు పెంచాలన్నారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, నాయకులు మురళి, రాంచందర్, అజీమ్, అలీం, అజార్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ దుకాణాలను తొలగించాలి

- శంభుని ఆలయం కమిటీ సభ్యులు
- చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని శంభుని గుడి చుట్టూ అక్రమంగా ఏర్పాటు చేసుకున్న దుకాణ సముదాయాలను వచ్చే శివరాత్రి పండుగ లోపు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యుడు పటేల్ ప్రసాద్ శుక్రవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియకు వినతి ఇచ్చారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో అతిపురాతనమైన శంభుని గుడికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. బయట ఆలయం చుట్టూ అన్యమతస్తులు ఎన్నోయేండ్ల క్రితం అక్రమంగా ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. వీటిని తొలగించాలని దేవాలయ పరిరక్షణ సమితి చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఆనాటి నిజామాబాద్ జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు ఆ దుకాణాలను 2023 జనవరి 26 లోపు పూర్తిగా తొలగిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారులు ఇచ్చిన హామీ గడువు పూర్తయి రోజులు గడుస్తున్నా నేటికీ దుకాణాలను తొలగించలేదని గుర్తు చేశారు. ఇకనైనా ఆ అక్రమ దుకాణాలను మహా శివరాత్రి పర్వదినం లోపు దుకాణాలను తొలగించి ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా దేవాలయానికి అప్పగించాలని కోరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, హిందువుల మనోభావాలను గౌరవిస్తూ అక్రమ దుకాణాలను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు.అలాగే నగరంలోని నీలకంఠేశ్వర్ దేవాలయ పరిధిలో ఉన్న దుకాణాలలో అన్యమతస్తులను వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. బంటు ప్రవీణ్,బంటు రామరాజు,ప్రతాప్,రాజ్,నరేష్, చైతన్య, ప్రసాద్, యోగేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో సుస్థిర అభివృద్ధి

- బీజేపీ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి కులాచారి దినేష్
- జక్రాన్‌పల్లి పరిధిలోని పలు గ్రామాల్లో శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్


పడకల్‌లో మాట్లాడుతున్న కులాచారి దినేష్

జక్రాన్‌పల్లి: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం సుస్థిర అభివృద్ధిని సాధిస్తోందని బీజేపీ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి కులాచారి దినేష్ స్పష్టం చేశారు. శుక్రవారం తొర్లికొండ, కలిగోట్, పడకల్, మాదాపూర్ గ్రామాల్లో శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. పడకల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బీజేపీయేనని ఘంటాపథంగా చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తామని చెప్పి కనీసం 12 గంటలు కూడా సరఫరా చేయడం లేదన్నారు. దీంతో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని అన్నారు.రైతులకు నాణ్యమైన కరెంట్ అందించకపోతే రైతుల తరఫున ఉద్యమిస్తామన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క గ్రామంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని విమర్శించారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. సమావేశంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జి విక్రం పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొప్పు రాజేందర్, ఉపాధ్యక్షుడు దత్తాద్రిగౌడ్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగడం పోశన్న తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


వంటను పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్‌అర్బన్: నగరంలో పోలీస్‌లైన్ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వండిన వంటను రుచి చూశారు.

అనంత పద్మనాభస్వామి కల్యాణం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్(ఏ) గ్రామంలో అనంత పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో ఘనంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా మల్కాపూర్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా కల్యాణాన్ని చూసేందుకు వచ్చారు. అనంతరం సాయంత్రం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,550	వెండి (కిలో)	71,500
22 క్యారెట్స్	53,973	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	25	క్యాప్సికం	40	60
బెండకాయ	50	70	గాజరుగడ్డ	20	40
బీరకాయ	50	60	పచ్చిమిర్చి	20	40
దొండకాయ	30	50	దోసకాయ	30	50
బీర్నిసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	50	గోబిపువ్వు	25	40
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	25	50	గోరు చిక్కుడు	45	60
కొత్తిమీర	20	40	చిక్కుడుకాయ	35	60
పుదీనా	40	60			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్-1- అమిగోస్-10.30,1.30,4.30 7.30,10.30
స్క్రీన్-2- పఠాన్(హిందీ)-4.30,10.30 మైఖేల్ -7.30
స్క్రీన్-3- పఠాన్(హిందీ)-1.30 వసంత కోకిల-4.40 రైటప్ పద్మభూషణ్ -7.40,10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1- అమిగోస్-10.30,1.30,4.30 7.30,10.30
స్క్రీన్-2 - రైటర్ పద్మభూషణ్-11.25, 2.05, 8.00,10.40 పఠాన్-(హిందీ)-4.45
స్క్రీన్-3- పఠాన్-(హిందీ)-12.35,6.45 10.00 పాప్‌కార్న్-(తెలుగు)-3.50
స్క్రీన్-4- ఇట్స్ పూరి లవ్-10.50 చెడ్డి గ్యాంగ్-1.40 వాల్తేరు వీరయ్య -4.35 వసంత కోకిల-7.55
దిల్‌వాలే దుల్హనియా లేజాయింగే -(హిందీ)-10.40

దేవి	అమిగోస్
నటరాజ్	పఠాన్ (హిందీ)
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	ఐపీఎల్
విజయ్	వసంత కోకిల